క్లుప్తంగా

పోస్టల్ బీమాపై అవగాహన


పోస్టల్ బీమాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం: పోస్టల్ సిబ్బంది శనివారం పట్టణంలో జీవిత బీమాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూపురం తపాలా పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్ కుమార్, హెడ్‌పోస్ట్‌మాస్టర్ మార్కండేయులు మాట్లాడుతూ గతంలో పోస్టల్ ఇన్సూరెన్స్ ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే వర్తించేదన్నారు. ప్రస్తుతం డిగ్రీ హోల్డర్స్, ప్రైవేటు ఉద్యోగులు, డాక్టర్స్, టీచర్స్, లాయర్స్, ఇంజినీర్లకు ఇన్సూరెన్స్ సదుపాయం ఉందదన్నారు. అలాగే ఈ నెల 11,12 తేదీల్లో మహా ఇన్సూరెన్సు మేళా నిర్వహిస్తున్నామని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా భక్త కనకదాస జయంతి


రాచూరులో కలశాలు మోస్తున్న మహిళలు

రొద్దం: మండలంలోని రాచూరు గ్రామంలో కురుబల ఆరాధ్యదైవం భక్త కనదాస జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం కనకదాస చిత్రపటాన్ని గ్రామంలో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కలశాలను గ్రామంలో ఊరేగించిన అనంతరం రచ్చబండ వద్ద ఏర్పాటు చేసిన కనకదాస చిత్రపటం చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణలు చేశారు. అనంతరం కలశాలను సమర్పించారు. సాయంత్రం కనకదాస భక్తి గీతాలు ఆలపిస్తూ కనకదాసు చిత్రపటాన్ని ఊరేగించారు.

నూతన ఎస్‌ఐకు సన్మానం


ఎస్‌ఐని సన్మానిస్తున్న జెడ్పీటీసీ భూతరాజు, నాయకులు


గుడిబండ: స్థానిక పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌ఐ రాజ కుళ్లాయప్పకు వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ఘనంగా సత్కరించారు. సమస్యలను న్యాయంగా పరిష్కరించాలని ఈ సందర్భంగా జెడ్పీటీసీ భూతరాజు ఎస్‌ఐను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు, సర్పంచులు కరుణాకర్, రంగస్వామి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ప్రధానకార్యదర్శి కొంకల్లు శివకుమార్, సోషల్ మీడియా కన్వీనర్ రామచంద్ర, ఎస్సీ సెల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు మెడల్స్ ప్రదానం


మెడల్స్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ మురళీధర్ బాబు, ఆర్మీ అధికారి అరుణ్‌కుమార్

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో ఇటీవల జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్మీ విభాగంలో పాఠశాలలో చదువుతున్న 84 మందికి వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. రన్నింగ్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, లాంగ్ జంప్, ఖోఖో తదితర పోటీల్లో 75 మంది విజేతలుగా నిలిచారని ఎన్‌సీసీ, ఆర్మీ విభాగపు అధికారి అరుణ్ కుమార్ తెలిపారు. వీరికి శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో పీఈటీ షబానా బాను, పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

స్పందించిన అధికారులు


సర్పంచ్‌ను ఇంట్లోకి ప్రవేశింపజేసిన అధికారులు

లేపాక్షి: మండలంలోని శిరివరం సర్పంచ్ నేత్రావతి, ఇద్దరు పిల్లలను ఇంట్లోంచి బయటకు గెంటేసిన ఘటనపై అధికారులు స్పందించారు. శనివారం సాక్షి దినపత్రికలో 'న్యాయం చేయాలని వినతి' వార్త ప్రచురితమైంది. ఆదివారం ఉదయం స్థానిక వీఆర్‌ఓ నాగరాజుతో పాటు రెవెన్యూ సిబ్బంది వెళ్లి సర్పంచ్ అత్త, మామ, కుటుంబ సభ్యులతో మాట్లాడి గతంలో ఇచ్చిన ఇంటిని ఆమెకు ఇవ్వాలని సర్దిచెప్పి చెప్పి, ఆమెను ఇంట్లోకి ప్రవేశింపజేశారు. తనకు న్యాయం చేసిన అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ చైర్మన్‌కు చాంబర్ ఏదీ?

- మరమ్మతుల పేరుతో చాంబర్‌కు తాళం
- అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు



మున్సిపల్ కార్యాలయం


కమిషనర్ చాంబర్‌కు తాళం వేసిన దృశ్యం

హిందూపురం టౌన్: మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డికి చాంబర్ కేటాయించకుండా టీడీపీ అడ్డుకుంటోంది. అధికారులను అడ్డుపెట్టుకుని నీచ రాజకీయాలకు పాల్పడుతోంది. వివరాలు.. హిందూపురం మున్సిపల్ చైర్మన్ స్థానం సొంతమవుతుందని గంపెడాశతో ఉన్న టీడీపీ నాయకుల ఆశలపై నీళ్లు జల్లుతూ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఉన్న వైఎస్సార్‌సీపీకి చెందిన బలరామిరెడ్డికి ఇన్‌చార్జ్ మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు. ఇది టీడీపీ వారికి ఏమాత్రం మింగుడు పడలేదు. హిందూపురం మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కించుకోవాలని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను తమ వైపు మళ్లించుకుని క్యాంపు రాజకీయాలు చేసిన టీడీపీకి చైర్మన్ స్థానం దక్కకపోవడంతో తీవ్ర నిరాశ, నిస్పృహలతో ఉండిపోయారు.

గత ఆగస్టులో చైర్‌పర్సన్ రాజీనామా

హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్న ఇంద్రజ ఈ ఏడాది ఆగస్టులో తన పదవికి రాజీనామా చేసింది. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న చైర్మన్ పదవిని వైస్ చైర్మన్‌గా ఉన్న బలరామిరెడ్డిని ఎంపిక చేస్తూ గత నెల మున్సిపల్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఉత్తర్వులు అందిన పక్షం రోజుల తర్వాత మున్సిపల్ అధికారులు చైర్మన్‌గా బలరామిరెడ్డికి బాధ్యతలను అప్పగించారు. అయితే ఇంతవరకూ చైర్మన్‌కు చాంబర్ కేటాయించలేదు. దీంతో మున్సిపల్ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నారు. చైర్మన్‌కు చాంబర్ కేటాయించకపోవడంపై ఇటీవల కౌన్సిల్ సమావేశంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. మరమ్మతుల కారణంగా చైర్మన్‌కు చాంబర్ కేటాయించలేదని, మరమ్మతులు పూర్తిచేసి చాంబర్ కేటాయిస్తామని అధికారులు సమాధానమిచ్చారు. అయితే ఈ ఏడాది ఆగస్టు వరకు బాగున్న చైర్మన్ చాంబర్ మరమ్మతుకు ఎలా వచ్చిందో అర్థం కావడం లేదని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ప్రశ్నిస్తున్నారు.

అధికారులను అడ్డు పెట్టుకుని..

హిందూపురం మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కించుకోవాలని ఆపసోపాలు పడిన అధికార పార్టీ టీడీపీకి చుక్కెదురైంది. దీంతో అధికారులను అడ్డం పెట్టుకుని రాజకీయాలకు తెరలేపింది. హిందూపురం పురపాలక సంఘంలో 38 మంది కౌన్సిలర్లలో కేవలం 6 స్థానాల్లో గెలిచిన టీడీపీ ఫిరాయింపు అస్త్రాన్ని ఉపయోగించి 15 మంది కౌన్సిలర్లను టీడీపీలో చేర్చుకున్నారు. దీంతో పూర్తి బలంతో చైర్మన్ పీఠం దక్కించుకోవాలని టీడీపీ యత్నించింది. త్వరలో చైర్మన్ ఎంపికకు నోటిఫికేషన్ వస్తుందని ఊహించి క్యాంపు రాజకీయాలను సైతం చేపట్టి, కౌన్సిలర్లను హైదరాబాద్‌కు తరలించారు. అయితే నోటిఫికేషన్ రాకపోవడంతో పాటు ఎవరూ ఊహించని విధంగా వైస్ చైర్మన్‌గా ఉన్న బలరామిరెడ్డిని డెలిగేట్ చైర్మన్‌గా ఎంపిక చేస్తూ మున్సిపల్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీనిని జీర్ణించుకోలేని అధికార పార్టీ నేతలు అధికారులను అడ్డం పెట్టుకుని ఇప్పటి వరకు ఆయనకు చాంబర్‌ను కేటాయించకుండా అడ్డు తగులుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాల్సిన అధికార యంత్రాంగం అధికార పార్టీ నేతల అడుగులకు మడుగులొత్తకుండా చైర్మన్‌గా ఎంపిక చేసిన వారికి వారి పదవీకాలం ఉన్నంత వరకు పురపాలక చట్టం మేరకు సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

కెనరా బ్యాంకు తనిఖీ


బ్యాంకు సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌ఎం లారెన్స్

అమరాపురం: స్థానిక కెనరా బ్యాంకును రీజినల్ మేనేజర్ లారెన్స్ శనివారం సాయంకాలం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో బ్యాంకు లావాదేవీల గురించి అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు పరిధిలో ఎంతమంది రైతులు, ఖాతాదారులున్నారు, వారికి అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం బ్యాంకు భవనాల భద్రత, ఏటీఎం తదితర వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో మేనేజర్ బాబుప్రసాద్ బేరా, అధికారులు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నైతిక విద్యతో పిల్లల సమగ్రాభివృద్ధి


మాట్లాడుతున్న భగవాన్ భాయ్

లేపాక్షి: నైతిక విద్య పిల్లల సమగ్ర అభివృద్ధికి దారితీస్తుందని రాజస్థాన్‌లోని మౌంట్ అబునుండి ప్రజాపితి బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలానికి చెందిన బ్రహ్మకుమార్ భగవాన్‌భాయ్ అన్నారు. శనివారం లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫిజికల్ ఎడ్యుకేషన్ శారీరక వికాసానికి, నైతిక విద్య సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. విద్యార్థులు మూల్యాంకనం, ప్రవర్తన, అనుకరణ, రచన, ప్రాక్టికల్ నాలెడ్జ్ వాటిపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ బాయ్, సుభాష్‌భాయ్, నరసింహారావు, వేదవతి, మంజుల, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలి


ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న ఎంఈఓ గంగప్ప, తదితరులు

హిందూపురం టౌన్: విద్యార్థులు చదువుతో పాటు పోటీ పరీక్షలకు సన్నద్ధమవ్వాలని ఎంఈఓ గంగప్ప సూచించారు. శనివారం అసోసియేషన్ ఆఫ్ ముస్లిం ప్రొఫెషనల్స్ (ఏఎంపీ) ఆధ్వర్యంలో విద్యార్థుల ఉపకార వేతనం, వివిధ పోటీ పరీక్షల కోసం పట్టణంలోని ఇక్రా పాఠశాలలో పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంఈఓతోపాటు ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రియాజ్, ఇక్రా పాఠశాల చైర్మన్ నజీరుద్దీన్, హుదా పాఠశాల కరస్పాండెంట్ సాదిక్ అలీ హాజరై ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ అసోసియేషన్ ఆఫ్ ముస్లిం ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 8వ తరగతి నుంచి డిగ్రీ వరకూ విద్యార్థులకు ఎంట్రన్స్ పరీక్షలను నిర్వహించి, ప్రతిభ కనబరిచిన వారికి ఉపకార వేతనాలు అందించి ప్రోత్సహించడంతో పాటు నీట్, సీయూఈటీ, ఐఐటీ, జేఈఈ, సీడీఎస్, ఎన్‌డీఏ పరీక్షలతో పాటు జాతీయ స్థాయిలో నిర్వహించే యూపీఎస్‌ఈ పరీక్షలకు సైతం శిక్షణ ఇవ్వడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం


మాట్లాడుతున్న ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్

పెనుకొండ: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందుకు సాగుతుందని ఆ బ్యాంక్ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక సర్వశెట్టి ఫంక్షన్ హాల్‌లో స్టేట్ బ్యాంక్ పెనుకొండ శాఖ ఆధ్వర్యంలో కస్టమర్ టౌన్‌హాల్ మీటింగ్ నిర్వహించారు. ఖాతాదారులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న సేవలను ఉన్నతాధికారులు అడిగి తెలుసుకున్నారు. ఖాతాదారులు ఇచ్చిన సలహాలు, సూచనలు విన్నారు. జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్లప్పుడూ మెరుగైన సేవలను ఖాతాదారుకు అందించడానికి కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ దినేష్ కుమార్, ధర్మవరం రీజినల్ మేనేజర్ శశిధర్, పెనుకొండ స్టేట్ బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి


సీసీరోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: పది కాలాల పాటు చెక్కు చెదరకుండా నిలిచేలా అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ కాంట్రాక్టర్లు, ఇంజినీర్లకు సూచించారు. ఈసందర్భంగా ఆయన తిరుమణి, వళ్లూరు గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు రూ 14.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం తిరుమణి లో ఆంజనేయ స్వామి ఆలయంలో నూతన కల్యాణ మంటపాన్ని ప్రారంభించారు. పళవల్లి అంబేడ్కర్ వసతి పాఠశాలలో ఏర్పాటు చేసిన కలికాసరె (చదువుపై ఆసక్తి) కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమాల్లో జిల్లా సీఈఓ జి ప్రభు, జపానందస్వామి, మున్సిపల్ చైర్మన్ రాజేశ్, శంకరరెడ్డి, డీడీపీఐ గిరిజ, పిడబ్ల్యూఏఈఈ అనిల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, బీజేపీ నాయకుడు శివ ప్రసాద్, బత్తినేని నాని తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో విద్యార్థి మృతి


గురుసాయి(ఫైల్)

మడకశిర: బేగార్లపల్లిలో గురుసాయి అనే విద్యార్థి అనారోగ్యంతో మృతి చెందారు. వివరాలు.. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో 7వ తరగతి విద్యార్థి గురుసాయి శుక్రవారం సాయంత్రం తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. వెంటనే తల్లిదండ్రులు బాలుడిని మడకశిర ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం హిందూపురం ఆసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో అక్కడే మృతి చెందాడు. డెంగీతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. శనివారం బేగార్లపల్లిలో విద్యార్థి మృతదేహాన్ని ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు సందర్శించి నివాళులర్పించారు. పాఠశాల హెచ్‌ఎం వెంకట్రాముడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలి

మడకశిర: ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థినిని వేధిస్తున్న అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు శనివారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ మాట్లాడుతు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థినిపై గత కొంత కాలంగా అదే కళాశాలకు చెందిన ఓ అధ్యాపకుడు వేధింపులకు పాల్పడుతున్నాడన్నారు. అధ్యాపకుడిపై వెంటనే కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర షష్టి


సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: నీలకంఠాపురంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం షష్టి వేడుకలు ఘనగా నిర్వహించారు. పురోహితులు సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ప్రత్యేక అలకంరణ చేసి పూజలు చేపట్టారు. భక్తులు పెళ్లి కాని బ్రాహ్మణులకు దుస్తులు అందజేసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం స్వామిని పల్లకీలో ఉంచి గ్రామంలో ఊరేగించారు. భక్తులు స్వామికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

తిరుమలకు బయలుదేరిన పాదయాత్ర బృందం

హిందూపురం: హిందూపురం నుంచి తిరుమలకు పాదయాత్రగా సుమారు 400మంది భక్తులు శనివారం బయలు దేరారు.ఈసందర్భంగా స్థానిక పేట వెంకటరమణ స్వామి ఆలయంలో ఉదయం భక్తబృందం మూలవిరాట్ శ్రీదేవి భూదేవి సమేత వెంకటరమణ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. వారంరోజుల అనంతరం శనివారం తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శనం చేసుకుంటామని పాదయాత్ర భక్త బృందం కన్వీనర్ భాస్కర్ తెలిపారు. పాదయాత్రను తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్ ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి జెండా ఊపి ప్రారంభించారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు


భూమిపూజ చేస్తున్న మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి

సోమందేపల్లి: మండలంలో రూ.5 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించడం జరుగుతుందని మంత్రి సవిత ఎంపీ పార్థసారథి తెలిపారు. స్థానిక అక్కమ్మ కొండ భగీరథ కల్యాణ మండపం నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రూ.80 లక్షల ఎంపీ నిధులతో ఈ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో బీసీలకు ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. ఎంపీ పార్థసారధి మాట్లాడుతూ.. తమ మధ్య ఎలాంటి విబేధాలు లేవన్నారు. కొంతమంది కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉప్పర సంఘం నాయకులు గోపాల్, రామచంద్ర, వెంకటరమణ, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి


మడకశిర మండలం బుళ్లసముద్రంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

సాక్షి నెట్‌వర్క్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని వక్తలు అన్నారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని కేజీబీవీ, ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో శనివారం హెచ్‌ఎంల అధ్యక్షతన మెగా పేరెంట్స్–టీచర్స్ సమావేశం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు రంగోలి, టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పెనుకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఎంపీ బీకే పార్థసారథి పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధికారులు, అనధికారులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

చేపల పెంపకానికి రేపు వేలం

అగళి: హళ్లికెర చెరువులో చేపల పెంపకం కోసం సోమవారం ఉదయం 11 గంటలకు హళ్లికెర సచివాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఈమేరకు పంచాయతీ కార్యదర్శి రమ్య శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు తెలిపారు. వేలంలో పాల్గొన దలచిన వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ధర్మవరం రూరల్: వాహనదారులు నిబంధనలను అతిక్రమించి అధిక లోడునే వేసుకోవద్దని రవాణాశాఖ అధికారి వర ప్రసాద్ హెచ్చరించారు. శనివారం ఆయన పట్టణం సమీపంలో గొట్లూరు రోడ్డులో పోలీసు సిబ్బందితో కలిసి వాహన తనిఖీలను చేపట్టారు.

అంబేడ్కర్ వర్ధంతి


కొవొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న దృశ్యం

పావగడ: పట్టణంలో భారత రాజ్యాంగ నిర్మాత డా బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి శనివారం నిర్వహించారు. తహసీల్దార్ వరదరాజు, ఈఓ జానకిరాం ఇతర అధికారులు, దళిత నాయకులు టోల్ గేట్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కొవ్వొత్తులు వెలిగించి మౌనాచరణ నిర్వహించారు.

భూ నిర్వాసితులను ఆదుకోవాలి


ఆర్డీఓ సువర్ణకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

గోరంట్ల: మండల పరిధిలోని పాలసముద్రం పరిధిలో ఏర్పాటైన బెల్, నాసిన్, ఎయిర్‌బస్సు తదితర పరిశ్రమలకు భూములు కోల్పోయిన రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వం ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణకు వినతి పత్రం అందజేశారు. పరిశ్రమల కోసం భూములు కోల్పోయిన రైతులకు ఇంటి స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేయాలన్నారు. భూమి సేకరించిన సమయంలో ఒక్కో రైతుకు ఒక్కో రకంగా నష్టపరిహారం ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పెద్దన్న, కార్మిక సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ కోర్టు

గోరంట్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం పుట్టపర్తి రెవెన్యూ డివిజినల్ అధికారి సువర్ణ రెవెన్యూ కోర్టు నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఆర్ఓఆర్ అపీల్ చేసిన రైతుల భూములకు సంబంధించి తహసీల్దార్ కార్యాలయంలో విచారణ జరిపారు. కార్యక్రమంలో సీఐ శేఖర్, తహసీల్దార్ మారుతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు

హిందూపురం: మెప్మా మహిళా గ్రూపు సభ్యులను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించడానికి ప్రభుత్వం యోచిస్తోందని మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు అన్నారు. మెప్మా విభాగం ఉద్యోగులతో కమిషనర్ శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్, ఎంఎస్‌ఎంఈ, రుణాలు, సోషియో ఎకనామిక్ సర్వే తదితర వాటి అమలులో హిందూపురం మెప్మా విభాగం ముందుంజలో ఉందన్నారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు పొదుపుకు సంబంధించి లబ్ధి వివరాలను అందరికీ వివరించి అన్ని మహిళా సంఘాలు అభివృద్ధి సాధించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఈలు భవాని, కాటమయ్య, డీఎంసీ గంగలయ్య, సీఓలు పరంజ్యోతి, నాగమల్లేశరి, తానిఫ్ అలీఖాన్, టీఎల్‌ఎఫ్, ఆర్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



హిందూపురం టౌన్: గోరంట్లలో ఉరి వేసుకుని మృతి చెందిన మహిళ మృతదేహానికి శనివారం విజన్ ఇన్ కో ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. గోరంట్లలో ఓ గుర్తు తెలియని మహిళ రెండు రోజుల క్రితం ఉరేసుకుని మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆమె వివరాలు లభించకపోవడంతో వినజన్ ఇన్ కో ఫౌండేషన్ చైర్మన్ రేణు చందన ఆధ్వర్యంలో సభ్యులు దిలీప్ కుమార్, అఖిల్ కుమార్, రమణారెడ్డిలు మోతుకుపల్లిలోని శ్మశాన వాటికలో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

రంగనాథస్వామి ఆలయానికి విరాళం


విరాళం అందజేస్తున్న భజన బృందం సభ్యులు

గోరంట్ల: మండల పరిధిలోని వానవోలు సమీపంలో వెలసిన పురాతన కస్తూర రంగనాథస్వామి దేవాలయ జీర్ణోద్ధరణ కోసం ఆ దేవాలయ భజన బృందం సభ్యులైన శంకరప్పస్వామి, నరసింహప్ప, శ్రీనివాసులు, లక్ష్మీదేవమ్మ, దండోర నారాయణ, బాబు ఇతర సభ్యులు శనివారం రూ.50,116 విరాళం అందజేశారు. అలాగే మామిడి కాయలపల్లి గ్రామస్తుడైన ఆదినారాయణ కుమారుడు గంగారాజు తనవంతు సహాయంగా రూ.5,116 విరాళం ప్రకటించారు. విరాళం మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.